

4,958 కొత్త రైస్‌కార్డులు

శ్రీకాకుళం : జిల్లాలో కొత్తగా 4,958 రైస్ కార్డులు మంజూరు చేసినట్లు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా జిల్లాలో ప్రస్తుతం ఉన్న 6,70,325 కార్డుదారులకు ప్రతినెలా బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ద్వై వార్షిక పథకంలో భాగంగా అర్హులై ఉండి గతేడాది ఆగస్టు నుంచి డిసెంబరు మధ్య కొత్త రైస్‌కార్డు, కార్డు విభజన కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారందరికీ కొత్త బియ్యం కార్డులను మంజూరు చేసినట్లు తెలిపారు. కొత్తగా మంజూరు చేసిన కార్డుదారులకు జనవరి నుంచే బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కొత్తగా కార్డులు మంజూరైన కార్డుదారులందరూ దీన్ని గమనించి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేయబడుతున్న బియ్యం, నిత్యావసర సరుకులను ఎండియు వాహనాల ద్వారా ఇంటి వద్దే పొందాలన్నారు.

మందకొడిగా ధాన్యం కొనుగోలు

- ఇప్పటివరకు 2.16 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు
- కొనాల్సింది 5.40 లక్షల టన్నులు
- వెంటాడుతున్న సాంకేతిక సమస్యలు

జిల్లాలో చివరి గింజ వరకు ధాన్యం కొంటాం. దళారుల ప్రమేయం లేకుండా చేస్తాం. రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. ఇవీ ప్రజాప్రతినిధులు, అధికారులు ధాన్యం కొనుగోలు ప్రారంభంలో చెప్పే మాటలు. కొనుగోలు విషయానికి వచ్చేసరికి పాత కథే పునరావృతమవుతోంది. ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా అధికారులు క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారే తప్ప పని జరగడం లేదు. డిసెంబరు మూడో వారంలోకి ప్రవేశించినా ధాన్యం కొనుగోలు జోరందుకోలేదు. జిల్లాలో నేటికీ పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలు తెరుచుకోలేదు. ధాన్యం సిద్ధంగా ఉన్నా కొనుగోలు చేయకపోవడంతో రైతులు దళారులకు అమ్ముకుంటున్నారు. సాంకేతిక సమస్యలు, ధాన్యం నాణ్యంగా లేకపోవడంతో మిల్లర్లు తీసుకునేందుకు నిరాకరించడం వంటి సమస్యలతో ధాన్యం కొనుగోలు ముందుకు సాగడం లేదు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



ఖరీఫ్ సీజన్‌లో 3,51,843 ఎకరాల్లో వరి వేశారు. ఇందులో 3,50,765 ఎకరాలకు పంటల క్రాపింగ్ జరిగింది. 3,34,330 ఎకరాలకు ఇకెవైసి పూర్తయింది. ఈ సంవత్సరం 8.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అందులో 7,87,447 మెట్రిక్ టన్నులు మార్కెట్‌లోకి వస్తుందని భావిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం 5.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం వరికి సాధారణ రకానికి రూ.2,183, గ్రేడ్-ఎ రకానికి రూ.2,203 మద్దతు ధర ప్రకటించింది. ధాన్యం కొనుగోలుకు అధికారులు జిల్లావ్యాప్తంగా 606 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాలను మూడు కేటగిరీలుగా విభజించారు. రెండు వేలు పైబడి ధాన్యం సేకరించే అవకాశమున్న కేంద్రాలను ఎ-కేటగిరీగా, వెయ్యి నుంచి రెండు వేల టన్నుల్లోపు కొనుగోలు చేసేవాటిని బి-కేటగిరీగా విభజించారు. వెయ్యి టన్నుల కంటే తక్కువ ధాన్యం కొనుగోలుకు అవకాశమున్న వాటిని సి-కేటగిరీగా నిర్ణయించారు.

మండలాల్లో కొనుగోలు పరిస్థితి ఇలా...

జిల్లాలో గ్రేడ్-ఎ, సాధారణ రకం ధాన్యం కలిపి మొత్తం 2.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. కంచిలిలో అత్యల్పంగా కేవలం 89.56 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. కవిటిలో 309.2 మెట్రిక్ టన్నులు, ఇచ్ఛాపురంలో 458.04 మెట్రిక్ టన్నులు, పొందూరులో 803.84 టన్నుల ధాన్యాన్ని కొన్నారు. లావేరులో 980.96 మెట్రిక్ టన్నులు, ఎచ్చెర్లలో 1552.28 టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. జిల్లాలో అత్యధికంగా జలుమూరులో 22,759 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఆ తర్వాత స్థానంలో సారవకోట ఉంది. సారవకోటలో 17,572 టన్నులను కొన్నారు. నరసన్నపేటలో 15,154 టన్నులను కొనుగోలు చేశారు. నందిగాంలో 13,409 మెట్రిక్ టన్నులు, కొత్తూరులో 13,024 మెట్రిక్ టన్నులు, కోటబొమ్మాళిలో 12,405 మెట్రిక్ టన్నులను కొన్నారు. ధాన్యం కొనుగోలుకు లక్ష్యం పెట్టుకోలేదంటూ అధికారులు చెప్తున్నా, కేంద్రాలకు నిర్దేశించిన మేరకే కొంటున్నారు. మిల్లులకు ఇచ్చిన ధాన్యం మేరకు మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారంటీలు తీసుకుంటున్నారు. బ్యాంకు గ్యారంటీలు పూర్తి కావడంతో ఆర్‌బికె సిబ్బంది తర్వాత వచ్చిన వాటిని వెనక్కి పంపిస్తున్నారు.

నత్తనడకన కొనుగోళ్లు

ధాన్యం కొనుగోలుకు అన్నిరకాల ఏర్పాట్లు చేశామని అధికారులు చెప్తున్నా, క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితులు కనిపించడం లేదు. కొనుగోలు కోసం 606 కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, ఇప్పటివరకు 533 కేంద్రాలు తెరుచుకున్నాయి. వీటి ద్వారా 2.16 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. ఇందులో గ్రేడ్-ఎ రకం 127.72 మెట్రిక్ టన్నులు కాగా, సాధారణ రకం ధాన్యం 2.15 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేశారు. బ్యాంకు గ్యారంటీలు, సాంకేతిక సమస్యలు వంటి కారణాలతో ధాన్యం కొనుగోలు సాఫీగా సాగడం లేదు. రైతుల నుంచి వచ్చిన ధాన్యం వివరాలను ఆర్‌బికె సిబ్బంది నమోదు చేస్తున్న సందర్భంలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్ని మిల్లులకు భారీగా లోడ్లు వెళ్తుంటే మరికొన్నింటికి స్వల్ప పరిమాణంలో ధాన్యం లోడ్లు వెళ్తున్నాయి.

అనుమానాస్పద లావాదేవీలపై నిఘా

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం



వచ్చే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చట్టవిరుద్ధమైన, పరిమితికి మించిన అనుమానాస్పద బ్యాంకు లావాదేవీలపై సమాచారం అందించాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక బ్యాంకు అధికారులకు సూచించారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి అధ్యక్షతన పలు బ్యాంకుల అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యాంకు లావాదేవీలు, అక్రమ నగదు స్వాధీనంపై ఎన్నికల సంఘం కొన్ని మార్గదర్శకాలను జారీ చేసిందని తెలిపారు. ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు నగదు లావాదేవీలపై బ్యాంకు అధికారులు దృష్టిసారించాలన్నారు. మరికొద్ది నెలల్లో ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున బ్యాంకుల్లో దాచుకున్న ధనాన్ని ఉపయోగించి ఎన్నికల్లో గెలవాలనే ఉద్దేశంతో భారీ మొత్తంలో డబ్బులు జమ చేయడంతో పాటు ఖాతాల నుంచి తరచూ విత్ డ్రా చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఏదైనా భారీ మొత్తం అమౌంట్ డిపాజిట్ చేయబడినా, ఉపసంహరించబడినా అలాంటి లావాదేవీలు అనుమానాస్పదంగా అనిపిస్తే, తప్పనిసరిగా సంబంధిత అధికారులకు సమాచారాన్ని అందించాలని చెప్పారు. పోలింగ్ తేదీకి ఆరు నెలల ముందు బ్యాంకుల ద్వారా కొన్ని బ్యాంకు ఖాతాల నుంచి అనేక ఖాతాలకు ఏవైనా అసాధారణ ఆన్‌లైన్ లావాదేవీలు జరిగితే, ఆ సమాచారాన్ని అధికారులకు తెలియజేయాలన్నారు. ఎటిఎం సెంటర్ నుంచి అసాధారణంగా డబ్బు విత్ డ్రా జరిగితే, ఆ విషయాన్ని వెంటనే అధికారులకు తెలియజేయాలని కోరారు. బ్యాంకు లాకర్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. బ్యాంకు, ఎటిఎం కేంద్రాల వద్ద పటిష్ట భద్రత కల్పించి, సిసి కెమెరాలు సక్రమంగా పనిచేసే విధంగా పర్యవేక్షించాలన్నారు. లాకర్ల వద్ద ఉన్న సిసి కెమెరాలను ప్రతిరోజూ పరిశీలించాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్‌పి జె.తిప్పేస్వామి, ఎస్‌బి డిఎస్‌పి కె.బాలరాజు, పలు శాఖల బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

అర్హులందరికీ 'నవరత్నాలు'

- జిల్లాలో 2,143 మందికి రూ.3.12 కోట్ల లబ్ధి
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అర్హత ఉన్న ఏ లబ్ధిదారుడూ సంక్షేమ పథకాలకు దూరం కాకుండా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. జిల్లాలో అర్హత ఉండి సాంకేతిక కారణాల వల్ల పథకాలను పొందలేని 2,143 మంది లబ్ధిదారులకు రూ.3.12 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నవరత్నాలు - ద్వైవార్షిక నగదు మంజూరు కింద అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందని వారి ఖాతాల్లో నగదును సిఎం జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి శుక్రవారం జమ చేశారు. కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది జనవరి నుంచి డిసెంబరు వరకు సాయం అందుకోని వారిని గుర్తించి నగదు చెల్లిస్తున్నట్లు చెప్పారు.

ఇబిసి నేస్తం, అమ్మఒడి, కాపు నేస్తం, మత్స్యకార భరోసా, వాహనమిత్ర తదితర పథకాలతో వారికి లబ్ధి చేకూరుతుందని చెప్పారు. కొత్తగా మరో తొమ్మిది వేల మందికి వివిధ పెన్షన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి, సుడా చైర్‌పర్సన్ కోరాడ ఆశాలత, పలు కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు రాజాపు హైమావతి, డి.పి దేవ్, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, బిసి కార్పొరేషన్ ఇడి గడ్డెమ్మ, సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

టిడిపిని గెలిపిస్తే పథకాలు ఆగిపోతాయి

పశుసంవర్ధక శాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస



పింఛన్లను పంపిణీ చేస్తున్న మంత్రి అప్పలరాజు

వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపిస్తే, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ ఆగిపోతాయని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని కోరారు. మండలంలోని పురుషోత్తపురంలో పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పింఛన్ల కోసం రోజుల తరబడి నిరీక్షించేవారని, నేడు ఒకటో తేదీకే ఇంటికి వాలంటీర్లు వచ్చి అందిస్తున్నారని చెప్పారు. అర్హులైన వారికి పలు పథకాల కింద వారి ఖాతాల్లో నిధులు జమ చేస్తుంటే ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు డబ్బులు పంచేస్తున్నారని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్నారని గ్లోబల్ ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. అదే చంద్రబాబు ఎన్నికల్లో గెలవడానికి అవే పథకాలను అంతకంటే ఎక్కువ ఇస్తానంటూ నేడు ప్రజల ముందుకొస్తున్నారని చెప్పారు. అధికారం కోసం చంద్రబాబు చెప్పున్న మాయమాటలను నమ్మొద్దని ప్రజలను కోరారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన ఎందుకు ఇటువంటి పథకాలను ప్రజలకు అందించలేకపోయారని ప్రశ్నించారు. టిడిపి పాలనలో పథకాల్లో అవినీతి, పథకాలు అందాలంటే లంచాలు ఇచ్చే పరిస్థితి ఉండేదని ఆరోపించారు. వైసిపి పాలనలో అవినీతిరహితంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మేలు చేసే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు. అలా ఇవ్వకపోతే పథకాలు ఇచ్చినా ప్రజలు ఓట్లు వేయరని, పథకాలను అమలు చేసే పరిస్థితి ఉండదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సురేష్‌బాబు, కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, కౌన్సిలర్ సనపల సింహాచలం, బి.చంద్రకళ, వైసిపి నాయకులు బడగల బల్లయ్య, అంబటి ఆనందరావు, బల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌పై ప్రజల్లో తిరుగుబాటు

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. జగన్‌పై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను ఎదుర్కొనే ధైర్యం లేక వైసిపి ఎమ్మెల్యేలు, ఎంపీలు ఆ పార్టీని వీడుతున్నారని చెప్పారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ జగన్ నియంతృత్వ పోకడలపై ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎదురుతిరుగుతున్నారని చెప్పారు. జగన్‌ను నమ్ముకుంటే భవిష్యత్ రాజకీయం అంధకారమేనన్న భావన వారిలో నెలకొందన్నారు. మరోవైపు జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని తెలిపారు. రాజీనామా చేసే వారిని పార్టీలో నిలిపేందుకు అగచాట్లు పడుతున్నారని చెప్పారు. స్వచ్ఛమైన పాలన అందించినట్లు నమ్మకం ఉంటే ఓటమి భయం ఎందుకని, అభ్యర్థులను ఎందుకు మారుస్తున్నారని ప్రశ్నించారు. గత ఎన్నికల ముందు ఒక్క ఛాన్స్ అన్న జగన్ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని, అందువల్లే ఓటమి భయం వెంటాడుతోందన్నారు. ఇప్పటివరకు 38 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు ప్రజలకు భయపడి సొంత నియోజకవర్గంలో పోటీ చేసేందుకు సిద్ధంగా లేరని, వీరంతా గడిచిన ఐదేళ్లలో ప్రజలకు ఏం చేయలేదన్న సత్యాన్ని గ్రహిస్తున్నారన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆరోపించారు. సచివాలయాల్లో అవినీతి లేదని చెప్పుకుంటున్న వైసిపి నాయకులు రూ.కోట్లను ఎలా కొల్లగొట్టారో ప్రజలకు తెలుసునన్నారు. ఎన్నికలు ఎప్పుడు వస్తాయా, జగన్‌ను ఇంటికి ఎంత తొందరగా పంపిద్దామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని చెప్పారు.

పాలన వికేంద్రీకరణతో సత్ఫలితాలు

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్



పరిపాలనకు సంబంధించిన వికేంద్రీకరణతో సత్ఫలితాలు సాధిస్తున్నట్లు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మండలంలోని రాగోలులో రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన రాగోలు-1, 2 నూతన సచివాలయ భవనాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏదైనా ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లి పని చేయించుకోవాలంటే జిల్లా, మండల కేంద్రాలకు వెళ్లి ఎన్నో వ్యయ ప్రయాసలకు లోనయ్యేవారని, ఇప్పుడు అందుకు భిన్నంగా సచివాలయాల ఏర్పాటుతో ఉన్న ఊరిలోనే పని జరుగుతోందన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో రూ.500 కోట్లతో 20 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామని తెలిపారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు డ్వాక్రా సంఘాలను మోసం చేశారని ధ్వజమెత్తారు.

చంద్రబాబు మాదిరిగా జగన్ ఎన్నికల ముందు ఒక మాట, తర్వాత మరో మాట చెప్పలేదన్నారు. ఇచ్చిన ప్రతి హామీకి కట్టుబడి ఎన్నికైన మొదటి రోజు నుంచే అమలు చేశారని కొనియాడారు. చంద్రబాబు హయాంలో ఉద్యోగులను వేధించేవారని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. కొత్త వ్యవస్థను రూపకల్పన చేసేటప్పుడు అపోహలు సృష్టించే వాళ్లు ఉంటారని, అవి అపోహలు మాత్రమేనని గమనించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి అంబటి నిర్మల, వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు, డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, వైసిపి మండల అధ్యక్షులు చిట్టి జనార్ధనరావు, ఎఎంసి చైర్మన్ మూకళ్ల తాతబాబు, సర్పంచ్ గేదెల చెంగలరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టు సడలని పోరు

- 25వ రోజుకు అంగన్వాడీల సమ్మె
- మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పద్మావతి ఇంటి ముట్టడికి యత్నం
- అడ్డుకున్న పోలీసులు
- నేడు కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి - శ్రీకాకుళం యంత్రాంగం

కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారానికి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు పట్టు సడలని పోరాటం చేస్తున్నారు. అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారానికి 25వ రోజుకు చేరింది. శ్రీకాకుళం నగరంలోని మండల వీధిలో అంగన్వాడీలను బెదిరించి బలవంతంగా కేంద్రాలను తెరిపించిన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి ఇల్లు ముట్టడికి అంగన్వాడీలు బయలుదేరారు. దీంతో ఆమె ఇంటి వద్ద పోలీసులను ఉంచారు. మరోవైపు ఒకటో పట్టణ సిఐ సన్యాసినాయుడు నేతృత్వాన పెద్దసంఖ్యలో పోలీసులు కళింగ రోడ్డులో అంగన్వాడీలను అడ్డుకున్నారు. అయినా మండలవీధిలోని అంగన్వాడీ కేంద్రం వద్దకు అంగన్వాడీలు చేరుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఎ.మహాలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలను బెదిరించి ఏడు కేంద్రాలను తెరిపించామని గందరగోళం సృష్టించడాన్ని ఖండించారు. ఒకవైపు అంగన్వాడీలను ఒత్తిడి చేస్తున్న పద్మావతి, ఆమె ఇంటి వద్ద ధర్నా జరుగుతుందని భయపడి పోలీసులను కాపలా పెట్టించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. గార ప్రాజెక్టు పరిధిలో 133 అంగన్వాడీ కేంద్రాలు తెరిపించామని ఆమె చెప్తున్న మాటలు అవాస్తవమన్నారు. బలవంతంగా రెండు సెంటర్లు తెరిపించినా, వారూ సమ్మెలో భాగస్వాములు కావడానికి తిరిగి మూసివేశారని తెలిపారు. అంగన్వాడీలపై అధికారులు, రాజకీయ నాయకుల బెదిరింపులకు పాల్పడడం సరికాదన్నారు. బెదిరింపులకు భయపడేది లేదని అంగన్వాడీలంతా సమ్మె దిగ్విజయంగా కొనసాగిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేస్తుందని అధికారులు తప్పుడు నివేదికలు ప్రభుత్వానికి పంపించి అంగన్వాడీలను గందరగోళానికి గురిచేస్తే, ఎవరూ అబద్ధాలు నమ్మరన్నారు. ఇటువంటి తప్పుడు ప్రచారం మానుకోవాలని హితవు పలికారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కలెక్టరేట్ వద్ద శనివారం 24 గంటల రిలే నిరాహార దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. రణస్థలంలో ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఒంటి కాలిపై నిల్చొని దండాలు పెడుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కె.సుజాత తదితరులు పాల్గొన్నారు. పలాసలో కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె శిబిరంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, సిపిఎం నాయకులు బమ్మిడి ఆనందరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎం.మంజుల, బి.సునీత, కె.జ్యోతి తదితరులు పాల్గొన్నారు. కొత్తూరులో సమ్మె శిబిరంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు కె.లక్ష్మి, ఎస్.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఆమదాలవలసలో ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీల సమ్మెకు సిటిజన్ ఫోరం ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి మోహనరావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు పంచాది లతాదేవి, పి.భూలక్ష్మి, మొదలవలస లత తదితరులు పాల్గొన్నారు. కోటబొమ్మాళిలో ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద దీక్ష చేపట్టారు. ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు డి.వి రమణ, కూన వలసయ్య సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుధ తదితరులు పాల్గొన్నారు. పొందూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో తమ సమస్యలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిష్కరించాలని అంగన్వాడీలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జ్యోతిలక్ష్మి, నాగరత్నం, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.





రణస్థలం : ఒంటి కాలిపై నిల్చొని దండాలు పెట్టి నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

శరవేగంగా అభివృద్ధి పనులు

ప్రజాశక్తి- రణస్థలం

శరవేగంగా అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో చేపడుతున్న జలజీవన్ మిషన్ ఇంటింటికి కుళాయిలను, గ్రామ సచివాలయం, రైతు భరోసా, హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనులు త్వరితగతన పూర్తి చేయాలన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యం కోసం పలు రోడ్ల కోసం నిధులు మంజూరు చేసామని, ఈ నిధులతో త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులుకు ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ సూర్యనారాయణ, పంచాయతీ రాజ్ డిఇఇ సీతంనాయుడు, పిఆర్ డిఇ ధర్మారావు, పిఆర్ ఇఇ హేమలత, పిఆర్ ఎఇ పోలినాయుడు, పంచాయతీ జఇలు కుర్మనాధం, అప్పన్న, సూర్యచంద్ర, శ్రీవల్లి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.


దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న స్థానిక నాయకులు

న్యాయం జరిగే వరకు పోరాటం

ప్రజాశక్తి- కవిటి

తమ జాతికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని బెంతు ఒరియా ప్రతినిధులు రజనీ కుమార్ దొలై, శ్రీకాంత్ పురియా అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం బెంతు ఒరియాలు చేస్తున్న రిలే నిరాహారదీక్షల్లో శుక్రవారం వరకు గ్రామానికి చెందిన శ్రీకాంత్ పూరియా ఆధ్వర్యంలో యువకులు దీక్షలో పాల్గొన్నారు. వీరికి స్థానిక నాయకులు బడగల రాజేంద్ర, బెండి జగదీష్, శిలగాపు అప్పలరాజు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ తమ సమస్యలు శాశ్వితంగా పరిష్కారం అయ్యేవరకు పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. ఈ దీక్షల్లో జగదీష్ బిసాయి, సుమన్ బిసాయి, దేవరాజు పురియా పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

భువనేశ్వరి పరామర్శలు బూటకం

ప్రజాశక్తి- ఆమదాలవలస


నియోజకవర్గ పరిధిలో బూర్జ మండలం తోటవాడ, ఆమదాలవలస మండలం ధన్నానపేట, నిమ్మతొర్లాడ గ్రామాల్లో చంద్రబాబు అరెస్టుతో గుండె ఆగి చనిపోయారని నారా భువనేశ్వరి చేసిన పరామర్శలు అన్ని బూటకమని వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ విమర్శించారు. శుక్రవారం పట్టణంలో బొడ్డేపల్లిపేటలో జగనన్న ప్రజాసేవ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నారా భువనేశ్వరి చేసిన పరామర్శ యాత్ర ఇక్కడ కూన రవికుమార్ అక్కడ చంద్రబాబు చేస్తున్న శవ రాజకీయంలో భాగమేనని మండిపడ్డారు. నాడు చంద్రబాబు అరెస్టును జిల్లాలోని ప్రజలందరూ సమర్ధించి ఆనందించిన వారేనని, తప్పని బాధపడిన వారు ఒక్కరూ లేరన్నారు. చంద్రబాబు జిల్లాకు చేసిన అభివృద్ధి శూన్యమని అభివృద్ధి చెప్పుకొని ఓటు అడగలేని పరిస్థితిలో టిడిపి నాయకులు ఉన్నారన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు దానేటి రామమోహనరావు, సంపతిరావు ప్రతాప్ కుమార్, అన్నెపు కృష్ణ, చింతాడ రాఘవేంద్రరావు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న ఎస్‌పి రాధిక

చెక్కు అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా హోంగార్డు విభాగంలో పనిచేస్తూ డిసెంబర్ నెలలో ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డ్ ఎల్.కృష్ణమూర్తికి శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా హోంగార్డులు స్వచ్ఛందంగా విరాళంగా ఇచ్చిన ఒక్కరోజు వేతనం మొత్తం రూ.4.20 లక్షల నగదు చెక్కును జిల్లా ఎస్‌పి జి.ఆర్.రాధిక శుక్రవారం అందజేశారు. ఈయన నందిగామ పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వర్తించే వారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ భవిష్యత్‌లో ఎటువంటి అవసరం ఉన్నా పోలీసుశాఖ ఎల్లవేళలా తోడుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో హోంగార్డు ఆర్‌ఐ కె.వి.నర్సింగరావు ఉన్నారు.


బహుమతులు అందజేస్తున్న బివివి ప్రసాదరావు

'టాలెంట్' చూపించిన విద్యార్థులు

కవిటి: స్థానిక ఎస్‌విజె విద్యాసంస్థల్లో శుక్రవారం నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపి ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ ఉన్నత పాఠశాలల నుంచి 136 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వి.ఇంద్రాషా, ఆర్ శ్రీకర్ ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకోగా ఆర్ బెలగాం ఉన్నత పాఠశాలకు చెందిన ఎల్.జ్ఞానేశ్వర్ తృతీయ స్థానం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కవిటి మండలం నుంచి ఇటీవల సబ్ ఇన్స్పెక్టర్‌గా ఎంపికైన ఎస్‌విజె పూర్వ విద్యార్థి నర్తు నేతాజీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బివివి ప్రసాదరావు, బాలక శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ బి.జగ్గారావు, పండి సత్యనారాయణ, ఎం.భాస్కరరావు, ఎఐ జోష్ పాల్గొన్నారు.

నేడు బస్సు యాత్ర

టెక్కలి: టిడిపి పర్యవేక్షణలో టిఎన్‌టియుసి ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్మిక చైతన్య బస్సుయాత్ర శనివారం టెక్కలి నుంచి ప్రారంభం కానుందని మండల టిడిపి అధ్యక్షులు బగాది శేషగిరి తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయం వద్ద గోడపత్రికను ఆవిష్కరించారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గం నుంచి టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం వరకు ఈ బస్సుయాత్ర జరగనుందని తెలిపారు. స్థానిక ఇందిరాగాంధీ జంక్షన్ వద్ద బస్సు యాత్రని అచ్చెన్నాయుడు ప్రారంభించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోళ్ల లవకుమార్, మల్లా బాలకృష్ణ, పోలాకి షణ్ముఖరావు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసనలు


శ్రీకాకుళం : పొర్లు దండాలతో నిరసన తెలుపుతున్న కార్మికులు


ఆమదాలవలస : ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మున్సిపల్ కార్మికులు 11వ రోజు సమ్మెలో భాగంగా శుక్రవారం వినూత్న రీతిలో పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలిపారు. నగరంలో మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న శిబిరంలో చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు అరుగుల గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం హాజరై మాట్లాడారు. మున్సిపల్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సమస్యలు పరిష్కరించాలని లేకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చినహామీలు అమలు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. మున్సిపల్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ (ఆప్కాస్) కార్మికులందరిని పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి తుంగలో తొక్కడం అన్యాయమని విమర్శించారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన పోరాటానికి ప్రజలంతా మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కళ్యాణ రాజు, ఆకుల శంకర్, డి.యుగంధర్, అరుగుల శేఖర్, ఎన్.పార్వతి, జె.మాధురి, పి.మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పారిశుద్ధ్య కార్మికుల నిరవధిక సమ్మె 11వ రోజుకు చేరుకున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని సిటిజన్ ఫోరం ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి మోహనరావు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద నిరవధిక సమ్మె చేపడుతున్న పారిశుద్ధ్య కార్మికులకు మోహనరావు సంఘీభావం తెలిపారు. అంతకుముందు పారిశుద్ధ్య కార్మికులు ఉరి తాళ్లతో ఉరి వేసుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికుల నాయకుడు తాడి సంతోష్, కె. తారకేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, జె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పలాస: మున్సిపల్ కార్మికులు శుక్రవారం కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద 11వ రోజు నిరవధిక సమ్మె చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పట్టదా సిఎం జగన్మోహన్‌రెడ్డి నీకో దండం అంటూ పడుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, శ్రీనివాసరావు,



పలాస : గాంధీ విగ్రహం వద్ద పొర్లు దండాలతో కార్మికుల నిరసన


ఇచ్ఛాపురం : చేతులెత్తి దండం పెడుతూ నిరసన తెలుపుతున్న కార్మికులు

యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ మురగన్, యం.రవి, యూనియన్ నాయకులు దివాకర్, ఎస్.శంకర్, తిరుపతి, ప్రకాష్ ముఖి, సీతమ్మ, గులాబీ, సావిత్రి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం ప్రభుత్వానికి ఒక దండం అంటు నిరశన వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య కార్మికులు సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్షం మంచిదికాదన్నారు. సమ్మెలో భాగంగా దీక్షా శిబిరం వద్ద రెండు చేతులు ఎత్తి మొక్కుతూ నిరశన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు చేయూతనివ్వాలి

శ్రీకాకుళం అర్బన్: పుట్టకతో, ప్రమాదాలు, అనారోగ్య సమస్యలు ఎదురై అంగవైకల్యంతో బాధపడుతున్న వికలాంగులకు స్వచ్ఛంద సంస్థలు చేయూతనివ్వాలని నగరపాలక సంస్థ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ హర్షవిల్లి ప్రాజెక్టు ఆర్గనైజర్ కల్లేపల్లి ఉషారాణి ఆధ్వర్యాన క్లబ్ సహకారంతో నగరంలో బాపూజీ కళామందిర్ శుక్రవారం నిర్వహించిన కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. హర్షవిల్లి లయన్స్ క్లబ్ ప్రాజెక్టు ఆర్గనైజర్ ఉషారాణి స్వచ్ఛందంగా రూ.70 వేలు వెచ్చించి 25 మందికి కృత్రిమ అవయవాలు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వికలాంగుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.కవిత మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన పరికరాలను వివిధ సంస్థల ద్వారా అందజేస్తున్నామని, గురుదేవ చారిటబుల్ ట్రస్టు పెద్దఎత్తున సహకారం అందిస్తుందన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హర్షవల్లి అధ్యక్షురాలు కరణం శోభారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ హారికాప్రసాద్, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు అప్పలనాయుడు, శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్, గురుదేవ్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు స్మృతి, ప్రభ, పరీజా, రాజా, కుమార్, ఈవెంట్ మేనేజర్ సాయిబాబా పాల్గొన్నారు.


ఉపకరణాలు అందజేస్తున్న కమిషనర్ ఓబులేసు

ఆరోగ్య సురక్ష పేదలకు వరం

ప్రజాశక్తి- కవిటి

ప్రజారోగ్యంపై సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండలం లండారిపుట్టుగ గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ నర్తు రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 1.6 కోట్ల కుటుంబాలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు


సంతబొమ్మాళి: సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జగన్నాయకులు

ప్రభుత్వం సిద్ధం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డి, నాయకులు, కృష్ణారావు, పిఎం తిలక్ తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలో బందపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జెడ్‌పిటిసి గూడ ఎండయ్య శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ చంద్రకుమారి, సర్పంచ్‌లు బెజ్జి జయమ్మ, గూడ వసంతకుమారి, బి.పాపారావు, వైద్యాధికారులు గ్రీష్మ, పలువురు సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలం కస్తూరిపాడు సచివాలయ పరిధి కస్తూరిపాడు, దుప్పిలపాడు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని టెక్కలి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త దువ్వాడ వాణి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యారాజు, స్థానిక సర్పంచ్ గురువెళ్లి ప్రకాష్, గురువెళ్లి గోవింద, ఎంపిటిసి సింగూరు వాసు పాల్గొన్నారు.

సోంపేట: సోంపేట సచివాలయం-1 పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసు, వైసిపి నాయకులు లక్ష్మీనారాయణ, వైద్య సిబ్బంది, ఇఒ వరప్రసాద్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

సంత బొమ్మాళి: ఉమిలాడ సచివాలయంలో పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, సర్పంచ్ కెల్లి లక్ష్మి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.ఉమా సుందరి, బోరు భద్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అవని, ఎస్.బి.కొత్తూరు సర్పంచ్ ప్రతినిధి ఉప్పాడ లోమనాధం, వైస్ సర్పంచ్ కొడ దామోదర్, వైసిపి నాయకులు అడ్ల అప్పారావు పాల్గొన్నారు.

సంత వేలం పాట ఖరారు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

నారాయణవలస గురువారపు సంత వేలంపాటను అనకాపల్లి జిల్లా దేవరాపల్లికి చెందిన రొంగలి సింహాచలం రూ.68లక్షల 50వేలుకు సొంతం చేసుకున్నారు. ఏప్రిల్ 2024 నుంచి ఏప్రిల్ 30-2025కు సంబంధించి ఆశీల వసూళ్లవేలం పాట శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో ఎంపిడిఒ కుప్పిలి ఫణీంద్రకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేలం పాటలో తర్ర గణపతి, సింహాచలం పాల్గొనగా అధికారులు రూ. 67.50 లక్షలకు పాటను ప్రారంభించగా సింహాచలం రూ.68.50లక్షలకు ఖరారు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటిండెంట్ సంపతిరావు రాజేశ్వరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రజని

చైతన్య సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

వైసిపి బిసి వ్యతిరేక విధానాలు నిలదీస్తూ బిజెపి విశాఖపట్నంలో పెద్దఎత్తున బిసి సామాజిక చైతన్య సభను ఈ నెల 7న ఆదివారం నిర్వహిస్తున్నదని ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున బిసి నాయకులు తరలి వెళ్లాలని ఎచ్చెర్ల అసెంబ్లీ కన్వీనర్ నడుకుదిటి రజని ఎన్ఇఆర్ విజ్ఞప్తి చేసారు. శుక్రవారం బిజెపి ఒబిసి మోర్చా ఆధ్వర్యంలో ఎన్ఇఆర్ క్యాంపస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైసిపి మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కారని బిసిలకు జీరో బడ్జెట్ నిధులతో పాలన చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికి దక్కిందన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ఒబిసి ప్రధాన కార్యదర్శి మీసాల హేమలరావు, కార్యవర్గ సభ్యులు మజ్జి నారాయణరాజు, ఇప్పర్తి అదియ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

నిర్దేశిత మెనూ అందజేయాలి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

నిర్దేశిత మెనూను అందజేయాలని ట్రిపుల్ ఐటి డైరెక్టర్ ఆచార్య కొక్కిరాల వెంకట ధన బాలాజీ అన్నారు. రాజీవ్‌గాంధీ యూనివర్సిటీలో శుక్రవారం ఆయన ఆకస్మికంగా మెస్‌ను సందర్శించారు. ఉదయం తయారుచేసిన అల్పాహారం పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి అల్పాహారం చేశారు. విద్యార్థులకు అందజేసిన ఆహారంలో రాజీ పడొద్దని అధికారులను ఆదేశించారు. ఆహారం తయారీకి వాడే అన్ని పదార్థాల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో సమావేశమై వారి అభిప్రాయాలపై ఆరాతీశారు. కార్యక్రమంలో ఒఎస్‌డి ఎల్.డి.సుధాకరబాబు, పరిపాలనాధికారి మునిరామ కృష్ణ, డీన్ అకడమిక్స్ మోహన్ కృష్ణ చౌదరీ, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ గేదెల రవి, డా.అసిరి నాయుడు, చీఫ్‌వార్డెన్ నర్సింహప్పడు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు రైతుల ఎదురుచూపులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యం శతశాతం కొనుగోలు చేస్తామని అధికారులు చెబుతున్నా కళ్లాల్లో ధాన్యం కొనేవారు లేక రైతులు ఆందోళన చెందుతున్నారని, పండగ పూట రైతుల చేతిలో చిల్లిగవ్వ లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పేర్కొన్నారు. శుక్రవారం అరసవల్లిలో ఆమె స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. పంట చేతికి వచ్చి నెలలు దాటుతున్నా కొనుగోలు కేంద్రాల నుంచి స్పందన రావడం లేదని, రైతులంతా పంటను నిల్వ


మాట్లాడుతున్న లక్ష్మీదేవి

చేసుకోలేక నానా అవస్థలు పడుతున్నారన్నారు. ధాన్యం ఎప్పుడు కొనుగోలు చేస్తారో తెలియక ఆర్‌బికెల చుట్టూ తిరుగుతున్నారన్నారు. సంక్రాంతి పండుగ సమీపిస్తున్నా ధాన్యం కొనుగోలు చేసే వారే లేక చేసిన అప్పులు తీర్చలేక రైతులు కన్నీటిపర్యంతం అవుతున్నారన్నారు. మరోవైపు తుపానుల వల్ల నష్టపోయిన రైతాంగానికి పంట నష్ట పరిహారం చెల్లించలేదన్నారు. తక్షణమే ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఆమె కోరారు.

క్రీడా స్ఫూర్తిని చాటాలి

ప్రజాశక్తి- పలాస

విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని చాటాలని, అకుంఠితమైన సాధనతో విజయం సొంతం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జాతీయ పోటీల కోసం రాష్ట్ర జట్టుకు జరుగుతున్న శిక్షణా శిబిరాన్ని ఉద్దేశించి శుక్రవారం ఆయన మాట్లాడారు. పలాస కేంద్రంగా తొలిసారిగా ఈనెల 9 నుంచి 13 వరకు జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలు జరగడం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో జాతీయ పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి పి.తవిటయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.దాశరథి, కె.హరిబాబు, జిల్లా పిఇటి సంఘ సంయుక్త కార్యదర్శి సిహెచ్ పద్మలోచనం, జోనల్ కార్యదర్శి పి.గజేంద్ర, పాఠశాల వ్యాయామవిద్య ఉపాధ్యాయులు బి.శంకరరావు, ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

షర్మిల రాకతో కాంగ్రెస్‌కు పునరుత్తేజం


ఆమదాలవలస: వైఎస్ షర్మిల రాకతో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రానుందని రాష్ట్ర పిసిసి ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు అన్నారు. శుక్రవారం మండలంలో కొర్లకోట గ్రామంలో విలేకర్లతో మాట్లాడుతూ తెలంగాణలో వైఎస్ఆర్ తెలంగాణ కాంగ్రెస్ పార్టీని జాతీయ కాంగ్రెస్‌లో విలీనం చేసి షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరడం పట్ల తాము వర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. తొందరలోనే కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు ఉంటాయని తెలిపారు.

టెక్కలి: వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలోకి రావడం ఆహ్వానించదగ్గ విషయమని, ఆమె రాకతో పార్టీకి బలం పుంజుకుంటుందని డిసిసి అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లుతో మాట్లాడారు. షర్మిళ రాకను తాము మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కిసాన్ అధ్యక్షులు మధుసూదనరావు పాల్గొన్నారు.

గిరిజన రహదారులు అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి- కొత్తూరు

మండలం గొట్టిపల్లి పంచాయతీ పరిధిలో కొండపై ఉన్న పెదరాజపురం, చినరాజపురం, కోతంగూడ, కొత్తపల్లి తదితర గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకార్యం కల్పించి, ఆదివాసులకు నెలవారి రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకుడు ఎన్.అప్పన్న మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్ల నుంచి ఈ ప్రాంత రోడ్డు సమస్య అస్పష్టంగానే ఉందని, బిట్లుబిట్లుగా సిసి రహదారులు వేయడం కారణంగా వేసిన కాస్తా రోడ్డు పూర్తిగా పాడైపోయిన పరిస్థితిలో ఉందన్నారు. ఈ కారణంగా ప్రయాణీకులకు ప్రమాదాల భారిన పడుతున్నారని, అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు కూడా ప్రధానమైన ఈరోడ్డు ప్రయాణానికి ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. గిరిజనుల ప్రాణాలు పోయినప్పటికీ పట్టించుకున్న పరిస్థితి లేదని, తక్షణమే ఈ గ్రామాలకు రోడ్డు సౌకార్యం కల్పించి రేషన్ సరుకులు గిరిజనులకు సక్రమంగా అందేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈయనతో పాటు సవర శ్రీను, సవర బుడ్డడు, సవర రాజమ్మి, సవర చిన్నరాజమ్మి, సవర జోయంతి, సవర రాజమ్మ, సవర పార్వతి, సవర ముఖలింగం పాల్గొన్నారు.


అధ్వానంగా ఉన్న రహదారి

కారు ఢీకొని ఇద్దరు మృతి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలో వలే సాగరం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై భువనేశ్వర్ నుంచి విశాఖ వెళ్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని శుక్రవారం తెల్లవారిజామున ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళ్తతున్న సంతోష్ కుమార్(31), కైలాస నాయక్(30) మృతి చెందారు. వీరు ఒడిశాకు చెందిన వారుగా గుర్తించారు. అంజేనపురం సమీపంలో గ్రానైట్ క్వారీలో పని చేస్తున్నారు. మృతులు శ్రీపురం కాయగూరలు మార్కెట్‌కు వెళ్తున్నట్లు తోటి కార్మికులు తెలిపారు. మృతదేహాలను జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు స్వాధీనంలోకి తీసుకున్నారు. బందువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ-2 రమేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

ప్రజాశక్తి-నౌపడ

సంతబొమ్మాలి మండలం వడ్డితాండ్ర గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురుని అరెస్టు చేసినట్లు నౌపడ ఎస్ఐ కిషోర్ వర్మ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం వడ్డితాండ్ర గ్రామంలో పేకాట శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో దాడులు నిర్వహించారు. ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 3,400 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పుస్తెలతాడు చోరీ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో పెద్ద జగన్నాధపురం గ్రామానికి చెందిన వట్టికూల రాజేశ్వరి తన మెడలో తులమున్నర పుస్తెలతాడును గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు శుక్రవారం మోటార్ సైకిల్‌పై వచ్చి తెంపుకొని పారిపోయారు. అక్కడే ఉన్న చెరువులో ఆమె స్నానం చేసి వస్తుండగా ఈ సంఘటన జరిగినట్లు బాధితురాలు నుంచి ఫిర్యాదు అందినట్లు ఎఎస్ఐ నర్సింగరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

గ్యాస్ సిలిండర్ చోరీ

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం నౌపడ గ్రామంలో ఓ పాస్ట్ ఫుడ్ దుకాణంలో ద్విచక్ర వాహనంపై ఇద్దరు అపరిచిత వ్యక్తులు వచ్చి గ్యాస్ సిలిండర్ దొంగిలించారు. ఈ వీడియో సిసి కెమెరాలో రికార్డు కావడంతో గ్రామంలో హల్ చల్ చేసింది. నౌపడలో లోపింటి రాజీవ్ గాంధీకి చెందిన పాస్ట్‌ఫుడ్ సెంటర్లో శుక్రవారం మధ్యాహ్నం గుర్తుతెలియని ఇద్దరు అపరిచిత వ్యక్తులు దౌర్జన్యంగా ప్రవేశించి గ్యాస్ సిలిండర్‌ను ద్విచక్ర వాహనంపై వచ్చి ఎత్తుకెళ్లారు. దీంతో బాధితుడు నౌపడ పోలీసులకు ఆశ్రయించగా సిసి కెమెరాలు పరిశీలించి నిందితులను వెతికే పనిలో పడ్డారు. ఇప్పటికే పలాసలో పలు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో గ్యాస్ సిలిండర్ల దొంగతనాలు జరుగుతున్న వార్తలు హల్చల్ చేస్తుండడతో చిన్నచిన్న వ్యాపారస్తులు, టిఫిన్ సెంటర్ల యజమానులు భయపడుతున్నారు.


భాస్కర్ గౌడ్‌ను పరామర్శిస్తున్న ఎంపీ

ఎంపీ పరామర్శ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండల టిడిపి అధ్యక్షులు భాస్కర్ గౌడ్‌ను ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు శుక్రవారం పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో భాస్కర్ గౌడ గాయపడటంతో ఆయన స్వగ్రామమైన రాజపురం గ్రామాన్ని సందర్శించి ఆయనకు పరామర్శించారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జాడుపల్లిలోని పివిసి ఫర్నిచర్ తయారీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి కలమట సాగర్, జాడుపల్లి ఎంపిటిసి కదంబల సుజాత రాజు, శ్రీనివాసరావు, బసవ పరమేశ్వర్ రెడ్డి, పడాల శ్రీను పాల్గొన్నారు.

చంద్రమోహన్ నియామకంపై హర్షం

ప్రజాశక్తి- టెక్కలి

జనసేన పార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులుగా పిసిని చంద్రమోహన్ నియామకం హర్షణీయమని జనసేన పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే టిడిపితో తమ పార్టీ పొత్తుపెట్టుకుని ఎన్నికల పోరుకు సిద్ధమవుతున్న తరుణంలో పార్టీ అధిష్టానం జిల్లా అధ్యక్షుడిని నియమించడంతో పార్టీని ప్రజల్లోకి మరింతగా ముందుకు వెళ్లేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. అభినందనలు తెలిపిన వారిలో కిరణ్‌తో పాటు అట్టాడ శ్రీధర్ ఉన్నారు.


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న పగడాలమ్మ

జెవివి కేలండర్ ఆవిష్కరణ

టెక్కలి: జనవిజ్ఞాన వేదిక ప్రచురించిన కేలండర్‌ను టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి గార పగడాలమ్మ శుక్రవారం ఆవిష్కరించారు. డివిజన్ విద్యాశాఖ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సామాన్య ప్రజల్లో నెలకున్న మూఢ విశ్వాసాలను పారద్రోలడంలో జెవివి చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు, మండల విద్యాశాఖాధికారులు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావు, జనవిజ్ఞాన వేదిక బాధ్యులు, యుటిఎఫ్ నాయకులు పాలవలస ధర్మారావు, తమ్మినేని వైకుంఠరావు, డొంకాన పాపారావు, దనుంజయరెడ్డి పాల్గొన్నారు.

గో సంరక్షణ కేంద్రం ఏర్పాటు

టెక్కలి: మండలంలో భగవాన్‌పురం గ్రామంలో గో సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు మంచాల శ్రీనివాస్ తెలిపారు. గోవుల సంరక్షణ కొరకు షెడ్, నీటి సదుపాయం, పశుగ్రాసం, వైద్య పరీక్షల పరీక్షల కోసం ఏర్పాట్లు చేయడమైందని తెలిపారు. నివాసగృహల నుంచి తప్పిపోయిన గోవులను సంరక్షించి మళ్లీ వారికి అప్పగించడం జరుగుతుందని శ్రీనివాస్ తెలిపారు.

ప్రజల కష్టం తెలిసిన నాయకుడు జగన్



ఇచ్ఛాపురం : కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ రామారావు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలో కొత్త పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ నర్తు రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత టిడిపి పాలనలో పింఛన్ల కోసం ఎంతో ఇబ్బంది పడేవారన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో మరోసారి జగన్ మోహన్‌రెడ్డికి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్పర్సన్ భారతి దివ్య, స్వర్ణమణి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ లోకేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ రమేష్, పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, జెసిఎస్ కన్వీనర్ సాలీనా డిల్లీ, వార్డ్ కౌన్సిలర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అని వైసిపి టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. శుక్రవారం మండలం కిష్టుపురం సచివాలయం పరిధిలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు అధ్యర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొడ్డు వెంకటరమణ, ఎంపిటిసి బొడ్డు చెంచులు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, వైసిపి నాయకులు పేడాడ వెంకటరావు, సచివాలయ అధికారులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: టెక్కలి సచివాలయం-1 పింఛను పంపిణీ కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిపి అట్లా సరోజనమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు సత్తారు సత్యం, సర్పంచ్ గొండెలి సుజాత, ఎంపిటిసిలు కూన పార్వతి, పీత హేమలత, మండల సచివాలయం కన్వీనర్లు



టెక్కలి రూరల్ : వృద్ధులకు పింఛన్లు అందజేస్తున్న వాణి

శిగిలిపల్లి మోహనరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సోంపేట: మండలం బారువా మేజర్ పంచాయతీలో పింఛను కానుక పంపిణీ కార్యక్రమంలో ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసుప పాల్గొన్నారు. కార్యక్రమంలో బారువ మేజర్ పంచాయతీ సర్పంచ్ ఎర్రా రజిని, వైస్ ఎంపిపి గుర్రాల శ్రీను, జెడ్‌పిటిసి తడక యశోద, మండల పార్టీ అధ్యక్షులు సిలగాన భాస్కరరావు, జెసిఎస్ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, ఎంపిటిసిలు తామాడ పద్మావతి, మద్ది సునీత, వైస్ సర్పంచ్ బత్తుల బాబురావు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి- కవిటి

పంచాయతీ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు దుగానపుట్టుగ సర్పంచ్ డి.భద్రాచలం తెలిపారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు పంచాయతీలో జరిగిన అభివృద్ధి, సమస్యలపై చర్చించారు. 2024-25 ఏడాదికి పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చిన్నారి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి- కొత్తూరు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వినియోగంపై గ్రామాల్లో అవగాహన కల్పించారు. శుక్రవారం మండలంలో మెట్టూరు, మెట్టూరు బిట్ -1, మెట్టూరు బిట్-2 గ్రామాల్లో పాతపట్నం నియోజకవర్గం స్వీప్ నోడల్ అధికారి అంపిలి లిల్లీరాణి ఆధ్వర్యంలో వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్లు, వికలాంగులుఇవిఎంల్లో ఓటు ఎలా వేయాలన్న దానిపై అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఆరుతడి పంటలపై అవగాహన కల్పిస్తున్న డిపిఎం

నేడు బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి- పలాస

మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు ఎంపిపి ఉంగ ప్రవీణ అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎన్.రమేష్ నాయుడు తెలిపారు. బడ్జెట్ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.



ఏర్పాటు చేసిన బెంచీల వద్ద మరువాడ గ్రామస్తులు

బెంచీలు వితరణ

నౌపడ : సంతబొమ్మాళి మండలం మరువాడ పంచాయతీ రెడ్డిక మరువాడ గ్రామానికి సామాజిక వేత్త దాసురాజు రూ.25వేలుతో ఏడు బెంచీలను వితరణగా అందజేశారు. ఈ మేరకు శుక్రవారం సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి, వైస్ సర్పంచ్ సుగ్గు సీతయ్య రెడ్డి, వార్డు మెంబర్ వసంత కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో బెంచీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాసురాజు మాట్లాడుతూ గ్రామస్తులు కూర్చునేందుకు, సేదతీరేందుకు గ్రామంలో పలుచోట్ల, అలాగే సముద్ర తీరంలో వీటిని అమర్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు దాసురాజుకు అభినందనలు తెలియజేశారు.

పొగమంచుపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పొగ మంచు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కె.భాగ్యలక్ష్మి వాతావరణ శాస్త్రవేత్త డాక్టర్ బి. మౌనిక ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో కోస్తా ఆంధ్రప్రదేశ్‌లో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య తూర్పు గాలులు వీస్తున్నాయని వీటి ప్రభావంతో వాతావరణం పొడిగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. పొగ మంచు ఒకటి లేదా రెండు చోట్ల అధికంగా చాలా చోట్ల అల్పంగా కురిసే అవకాశం ఉందని తెలిపారు. తక్కువ ఉష్ణోగ్రత, పొగ మంచు వలన పెసర, మినుము పంటల్లో బూడిద తెగులు ఆశించే అవకాశం ఉందని వీటి నివారణకు కార్బండజమ్ ఒక గ్రాము లీటర్ నీటికి కలిపి పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని తెలిపారు.

చల్లని వాతావరణం వల్ల వరి నారు మడిలో జింకు లోపం వచ్చే అవకాశం ఉందని దీని నివారణకు జింక్ సల్ఫేట్ రెండు గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. పొలంలో ఎకరానికి 20 కేజీల జింక్ సల్ఫేట్ వేసుకోవాలని తెలిపారు. అలాగే వేరుశెనగ పంటలో రసం పీల్చే పురుగుల నివారణకు డైమిథమేట్ రెండు మిల్లీలీటర్లు లీటరు నీటికి లేదా ఇమిడాక్లోప్రైడ్ 0.6 మిల్లీలీటర్లు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు.

యువ రైతులకు శిక్షణా ధ్రువపత్రాలు

ఆమదాలవలస: వారం రోజులుగా పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో యువ రైతులకు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ముగింపులో భాగంగా శిక్షణను పూర్తి చేసుకున్న యువ రైతులకు కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ భాగ్యలక్ష్మి, ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రరావు చేతుల మీదుగా శిక్షణా సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ వారం రోజులు పాటు జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో యువత ఉత్సాహంతో పుట్టగొడుగుల పెంపకం నేర్చుకున్నారని అన్నారు. అనంతరం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి. సునీత మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో యువత పుట్ట గొడుగుల పెంపకంలో వివిధ నైపుణ్యతలను



మాట్లాడుతున్న కెవికె సమన్వయకర్త భాగ్యలక్ష్మి

నేర్చుకున్నారని తెలిపారు. కీటక శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. అనూష మాట్లాడుతూ శిక్షణలో భాగంగా వివిధ శాస్త్రవేత్తలతో తరగతులను నిర్వహించడం జరిగిందని తెలిపారు. వారం రోజులలో వారి చేత పుట్టగొడుగులను సాగు చేయించడం మరియు ప్రాంతీయంగా ఉన్నటువంటి పుట్టగొడుగుల యూనిట్ ను సందర్శించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పోరాట స్ఫూర్తితో ఆదివాసీ ఉద్యమం ముందుకు



చిలకమ్మ స్థూపం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- పలాస

శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, ఆదివాసీ వీరవనిత సవర చిలకమ్మ పోరాట స్ఫూర్తితో ఆదివాసీ ఉద్యమం ముందుకు సాగాలని అఖిల భారత ఆదివాసీ వేదిక (ఎఐటిఎఫ్) జాతీయ కమిటీ సభ్యురాలు ఎస్.జయలక్ష్మి పిలుపునిచ్చారు. చిలకమ్మ 28వ వర్ధంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మందస మండలం కొండలోగాంలో చిలకమ్మ స్మారకస్థూపం వద్ద ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఆదివాసీల హక్కులకు రక్షణగా ఉన్న చట్టాలను పాలకవర్గాలు బుట్ట దాఖలు చేసి, ఆదివాసీల హక్కులను కాల రాస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లాకమిటీ కార్యదర్శి తాండ్ర ప్రకాష్, ఎఐకెఎంఎస్ జిల్లా కమిటి నాయకులు గొరకల బాలకృష్ణ, ప్రజా సంఘాల నాయకులు రాపాక మాధవరావు, కుత్తుం హేమక్క పి.మల్లిబాబు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా శుక్రవారం డిపిఎం ధనుంజయరావు యూనివర్సిటీ బోర్డు మెంబర్ దేవుళ్ళ ఆధ్వర్యంలో బాటమ్ లెవెల్ యాక్షన్‌ప్లాన్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సంఘాలు, ఎంఎంఎస్, ఎఫ్‌పిఒఎస్ ప్రోత్సాహంపై రైతులకు వివరించారు. చిరుధాన్యాల పంటలపై రైతులు దృష్టి ఎక్కువ పెట్టాలని, అందులో అంతర పంటలు కనీసం 10 రకాలు తగ్గకుండా వేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో గోవిందరెడ్డి, శివాజీ, మునసయ్య, చిన్నమ్ముడు, హేమంత్, వెలుగు అసోసియేషన్ ప్రతినిధి శ్రీనివాస్, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు అగ్నికులక్షత్రియ ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

జిల్లా అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో సోంపేట మండలం బారువ బీచ్‌లో ఆదివారం ఉదయం జిల్లా అగ్నికుల క్షత్రియ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం జరుగుతుందని గౌరవ అధ్యక్షులు డాక్టర్ దున్న కృష్ణారావు తెలిపారు. శుక్రవారం పూండిలోని రాజరాజేశ్వరీ నర్సింగ్ హోంలో ఆయన విలేఖర్లతో మాట్లాడారు. ఆదివారం ఉదయం 9 గంటలకు కాశీబుగ్గ టికెఆర్ కళ్యాణమండపం నుంచి బైక్ ర్యాలీ బయలుదేరుతుందని తెలిపారు. జిల్లాలో ఉన్న అగ్నికుల క్షత్రియ కుటుంబ సభ్యులు పాల్గొని ఆత్మీయ సమావేశం విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మరిన్ని సేవా కార్యక్రమాలు : జెసిఐ

శ్రీకాకుళం అర్బన్: జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ శ్రీకాకుళం నూతన కార్యవర్గ సమావేశం శుక్రవారం నగరంలో చైతన్య సహకార జూనియర్ కళాశాలలో జరిగింది. ఈసమావేశంలో జెసిఐ ఫౌండర్ ప్రెసిడెంట్ జామి భీమశంకరరావు హాజరై నూతన అధ్యక్షునిగా ఎన్నికైన కూన అనిల్ కుమార్ పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. రానున్న రోజుల్లో జెసిఐ ఆధ్వర్యాన మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని సద్వినియోగ పర్చుకుని సేవా కార్యక్రమాల్లో భాగస్వాముల వుతామన్నారు. బాధ్యతలు అప్పగించిన భీమశంకరరావు,



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

నటుకుల మోహన్ వైస్ ప్రెసిడెంట్లు డా. టి. మణికంఠ, ఉర్లం. శివతేజ, డైరెక్టర్లు ప్రభాస్, సూర్య, పద్మభూషణ్, సాయి, జాడ సాయి పాల్గొన్నారు.

7న జిల్లాస్థాయి చెకుముకి పోటీలు

టెక్కలి: ఈ నెల 7న ఆదివారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి చెకుముకి పోటీలు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్నాయని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుప్పిలి కామేశ్వరరావు, గొంటి గిరిధర్‌లు ప్రకటనలో తెలిపారు. ఇటీవల నిర్వహించిన మండల, డివిజన్‌స్థాయి పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. హైస్కూల్ స్థాయిలో 380 పాఠశాలల నుంచి సుమారు 22 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఈ పోటీలకు జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, సమగ్ర శిక్షా జిల్లా అధికారి రోణంకి జయప్రకాష్, శ్రీకాకుళం, టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారులు ఆర్.విజయలక్ష్మి, గార పగడాలమ్మ, డైట్ ప్రిన్సిపాల్ తిరుమల చైతన్యలు హాజరు కానున్నారని తెలిపారు. ఆయా మండలాల విద్యార్థులు హాజరయ్యేలా ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మత్తులు, విద్యుత్ తీగలు అమర్చుటలో భాగంగా ఆదివారం ఉదయం 10.30 నిమిషాల నుంచి సాయంత్రం 4 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలిపారు. పట్టణంలోని కోర్టు, విద్యానగర్, మున్సిపల్ ఆఫీస్, ధర్మారావు క్వార్టర్స్, సాయి నగర్, చంద్రయ్యపేట, కిల్లి వారి క్వార్టర్స్, కృష్ణాపురం, సవర్రాజు రైస్‌మిల్, ఎల్ఐసి ఆఫీస్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని పేర్కొన్నారు. ఈ అసౌకర్యాన్ని వినియోగదారులు గమనించి తమ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.